క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శుక్రవారం తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రెండో మహాసభ వాల్‌పోస్టర్లను టీయూసీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తన్న మాట్లాడుతూ..జీపీ కార్మికులకు రూ.26 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షల బీమా కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు.

హోటళ్లలో తనిఖీలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఆర్డర్ మెస్‌లలో పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పరిశుభ్రతను పాటించని, నిషేధిత ప్లాస్టిక్ వాడిన వారికి మున్సిపల్ సానిటరీ ఎస్సై జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపార సంస్థలు పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. పర్యావరణ విభాగం ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేల్పూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం..

వేల్పూర్: మండల కేంద్రంలోని 102 నంబరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీవో సాయిలు శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లల హాజరు, రికార్డులను పరిశీలించారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు.

కెపాసిటర్లు అమర్చుకోవాలి

కమ్మర్‌పల్లి: రైతులు వ్యవసాయ మోటార్ పంపు సెట్లకు కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఎరుకుల నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో లోపం ఏర్పడినప్పుడు రైతులు లైన్‌మెన్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ అధికారులకు తెలియకుండా రైతులు ఎటువంటి పనులు చేపట్టరాదని సూచించారు. టీఎం సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్, మర్రిపల్లి రాజాగౌడ్, డీఈఈ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆంక్షలు అమానుషం

బాల్కొండ: ఏర్గట్ల మండల కేంద్రంలో శివాజీ విగ్రహ ఏర్పాటుపై పోలీసులు ఆంక్షలు విధించడం అమానుషమని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. విగ్రహ ఏర్పాటును, ప్రతిష్ఠను రాజకీయ, మతపరమైన కోణంలో చూడటం సరికాదన్నారు. స్థానిక యువకులు స్వచ్ఛందంగా విగ్రహం ఏర్పాటు చేసుకున్నారన్నారు. యువకుల సహనాన్ని పరీక్షించవద్దని, శివాజీ యుద్ధవీరుడని గుర్తు చేశారు.

ఆహ్వాన పత్రం అందజేత



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న వీర హనుమాన్ విజయయాత్రకు ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్‌ను ఫౌండేషన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ యాత్రలకు రావాలని ఆహ్వాన పత్రం అందజేశారు. బజరంగ్‌దళ్ జిల్లా బాధ్యులు గటాడి గంగాచరణ్, జిల్లా అధికార ప్రతినిధి బొచ్కర్ నిఖిల్, పట్టణ బజరంగ్‌దళ్ అధ్యక్షుడు కత్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు స్టాల్‌ను సందర్శించిన కేంద్రమంత్రి



సుభాష్‌నగర్: ఢిల్లీలోని స్టార్టప్ మహాకుంభ్‌లో ఏర్పాటుచేసిన జాతీయ పసుపు బోర్డు స్టాల్‌ను కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

వేల్పూర్: పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, నేతలు నరేందర్, స్వరూప ఇంద్రాగౌడ్, రాజేందర్, దామోదర్‌గౌడ్, చరణ్, రమణ,మల్లేష్, జంగన్న, రాజ్‌ముత్యం పాల్గొన్నారు.

నందిపేటలో చలివేంద్రాలు ..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని బస్టాండ్, పోస్టాఫీసు వద్ద స్థానిక నాయకుడు సిలిండర్ లింగం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శుక్రవారం కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ప్రారంభించారు. కండక్టర్ నారాయణ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఫంక్షన్ హాల్

- రూ.40లక్షలు వెచ్చించి నిర్మించినా ప్రయోజనం శూన్యం
- జీపీకి అప్పగించామంటున్న పంచాయతీరాజ్ ఏఈ
- మాకు అప్పగించలేదంటున్న జీపీ కార్యదర్శి
- నిర్వాహకులెవరో తెలియని దుస్థితి



ఫంక్షన్ హాల్ ఎదుట పెరిగిన పిచ్చిమొక్కలు



రుద్రూర్‌లో నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్

రుద్రూర్ : అతి తక్కువ వ్యయంతో పేదలు శుభకార్యాలు చేసుకునేందుకు ప్రతి మండల కేంద్రంలో జనరల్ ఫంక్షన్ హాల్ అవసరమని భావించిన అప్పటి స్పీకర్, ప్రస్తుత బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గతంలో ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా రుద్రూర్ మండల కేంద్రానికి రూ.40 లక్షలు మంజూరు చేయగా అన్ని హంగులతో ఫంక్షన్‌హాల్ నిర్మాణం పూర్తయింది. దీన్ని ఫిబ్రవరి 2022లో స్పీకర్ హోదాలో ఆయన ప్రారంభించారు. ఫంక్షల్ హాల్ నిర్వహణకు అవసరమైన కుర్చీలు, ఫర్నిచర్ సమకూర్చే బాధ్యతను అప్పటి మండల, స్థానిక ప్రజాప్రతినిధులకు అప్పజెప్పారు. పేదలకు తక్కువ చార్జి(రూ.5 వేల వరకు) తీసుకోవాలని సూచించారు. దీంతో నిరుపేదలు ఎంతో సంతోషించారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు చార్జి చేస్తున్నాయి. తొలి ఏడాది ఐదారు ఫంక్షన్‌లు కూడా జరిగాయి. ఉద్యోగాన్వేషణలో ఉన్న నిరుద్యోగుల కోసం పీబీఆర్ ఉచిత కోచింగ్‌ను కూడా ఇక్కడే నిర్వహించారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్వహణ బాధ్యతను అధికారులు గాలికి వదిలేయడంతో మందు బాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం వెరసి ఫంక్షన్ హాల్ నిరుపయోగంగా మారింది. ప్రస్తుత అధికారులకు దీని నిర్వహణ ఎవరు చూస్తున్నారో తెలియకపోవడం గమనార్హం. జీపీ కార్యదర్శిని ప్రశ్నిస్తే మాకు అప్పగించలేదనే సమాధానమిస్తున్నారు. తహసీల్దార్(జీపీ ప్రత్యేకాధికారి) దృష్టికి తీసుకెళితే తెలియదనే జవాబు వస్తోంది. నిర్మాణం పూర్తి కాగానే జీపీకి అప్పగించామని ఏఈ పీఆర్ పవన్ చెబుతున్నారు. నిర్వహణ సరిగా చేస్తే పేదలకు ఆర్థికంగా ప్రయోజనం కలగడమే కాకుండా మరొకరికి ఇక్కడ ఉపాధి కల్పించవచ్చుననే అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

గాలికొదిలేయడం సరికాదు



పేదల కోసం ఫంక్షన్ నిర్మాణం చేపడుతున్నందుకు ఎంతో సంతోషించాం. రూ. వేలు ఖర్చు పెట్టి ఫంక్షన్ చేయలేని వారికి ఎంతో ఉపయోగం. ప్రారంభించి మూడేళ్లయినా నిరుపయోగంగా ఉంచడం సరికాదు. అధికారులు దృష్టి పెట్టి వెంటనే ఉపయోగంలోకి తీసుకు రావాలి. – లతేందర్, స్థానిక నాయకుడు

లక్ష్యాన్ని నెరవేర్చాలి



గరీబోళ్లు ఫంక్షన్‌లు చేసుకోవడానికి ఈ ఫంక్షన్ హాల్ చాలా బాగుంది. రూ.లక్షలు పెట్టి కట్టిన ఫంక్షన్ హాల్‌ను ఎవరూ పట్టించుకోకపోవడంతో పోకిరీలకు అడ్డాగా మారింది. ఎమ్మెల్యే సాబ్ ఎంతో మంచి ఆలోచనతో కట్టిన హాల్‌ను గరీబోళ్లకు ఉపయోగపడేటట్లు చేయాలి. –రజాక్, రుద్రూర్

పథకాలను లబ్ధిదారులకు చేరవేసే బాధ్యత అధికారులదే

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను లబ్ధిదారులకు చేరవేసే బాధ్యత అధికారులదేనని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజుతో పాటు నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల అధికారులతో సమస్యలపై చర్చించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో తాగునీటికి కొరత లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములన్నీ గుర్తించి హద్దులు నిర్ణయించాలని సూచించారు.

వడదెబ్బ నివారణపై కరపత్రం ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

ఆర్మూర్‌టౌన్: వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్మూర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్ రూపొందించిన కరపత్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఎండ తీవ్రత బాగా ఉన్న సమయంలో అనవసరంగా బయటకు రావద్దన్నారు. అలాగే ఓఆర్ఎస్ పౌడర్‌తో నీరు తీసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు.. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ కరపత్రం ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది సంగీత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల సాధికారత – మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయవాది, మాజీ కౌన్సిలర్ సంగీతా ఖాందేష్ హాజరై మాట్లాడారు.. ఆకతాయిల వేధింపులను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'షీ టీం' గురించి వివరించారు. పలు చట్టాలపైన విద్యార్థినులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఊపిరి ఉన్నంత వరకు ఉపయోగపడేది జ్ఞానమే'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: ఆస్తులు కరిగిపోయినా ఊపిరి ఉన్నంతవరకు ఉపయోగపడేది జ్ఞానం మాత్రమేనని, అది చదువుతోనే సాధ్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన వేల్పూర్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేల్పూర్ ఉన్నత పాఠశాల ఎందరో మేధావులను తయారు చేసి సమాజానికి అందించిందని గుర్తు చేశారు. మంత్రులుగా పనిచేసిన స్వర్గీయ మహిపాల్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, అనేక హోదాలలో పనిచేసిన తన తండ్రి వేముల సురేందర్‌రెడ్డి ఈ పాఠశాలలో చదువుకున్న వారేనని చెప్పారు. ఎమ్మెల్యేగా అన్నపూర్ణమ్మ, డీసీసీబీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా చేసిన ప్రొఫెసర్ లింబాద్రి వంటి ఉన్నతస్థాయి విద్యావేత్తలను, జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేసిందన్నారు. డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సీతయ్య, లక్ష్మారెడ్డి, సంజీవ్‌రెడ్డి, శంకర్, ఎంఈవో రేణుక, హెచ్‌ఎం రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



బోధన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్



రుద్రూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై సాయన్న

రుద్రూర్/బోధన్‌టౌన్(బోధన్) : రానున్న శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి వేడుకలను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై సాయన్నలు వేర్వేరుగా సరూచించారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో శాంతి కమిటీ సమావేశం, రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీరామ ఆలయ కమిటీ, శ్రీ ఆంజనేయ ఆలయ కమిటీ, జయంతి ఉత్సవాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేడుకల్లో డీజేలను నిషేధించామని తెలిపారు. ఉత్సవ వేడుకలు, శోభాయాత్ర, ర్యాలీలకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లలో తెలియజేయాలని కోరారు. సమావేశంలో బోధన్ సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, వర్ని ఎస్సై మహేష్, ఏఎస్ఐ రాజుశక్కర్‌నగర్, ఎడపల్లి, రెంజల్ మండలాల శ్రీరామ నవమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'రైతులకు ఇబ్బందులు కలగొద్దు'



వివరాలను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ వికాస్

బోధన్‌రూరల్: వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులకు లేకుండా చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం పంటాకుర్దులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి రాజేశ్వరి

బోధన్‌టౌన్(బోధన్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాతా శిశుమరణాల సంఖ్యను తగ్గించాలని జిల్లా వైద్యాధికారిణి రాజేశ్వరి అన్నారు. శుక్రవారం బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచి, రిఫర్ చేయడం తగ్గించాలని, సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో 1982-83 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1982–83 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 42 ఏళ్ల తరువాత ఒకే చోట కలవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

మాక్లూర్: మండలంలోని కల్లెడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01 ఏడాది పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆ పాఠశాల ప్రాంగణంలోనే మళ్లీ కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సన్మానించారు. విందులో పాల్గొని సంతోషంగా గడిపారు.



2000-01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

రాజ్యాంగ విలువలను దెబ్బతీసే కుట్ర



మందర్నాలో అంబేద్కర్, మహాత్ముడి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



కోస్లీలో .. కాంగ్రెస్ నేతలు

బాల్కొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తోందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. శుక్రవారం మెండోరా, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాయటానికి కుట్ర చేస్తుందన్నారు. బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నగేష్‌రెడ్డి, వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని డీసీసీబీ మాజీ చైర్మన్ మునిపల్లి సాయి రెడ్డి అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు ముక్కెర విజయ్, మల్లా రెడ్డి, ఉదయ్, బార్ల ముత్యం పాల్గొన్నారు.

నందిపేట్(ఆర్మూర్): తల్వేదలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ నిర్వహించారు. పాదయాత్రగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు పిప్పెర సాయరెడ్డి, బొంకం గంగారెడ్డి, ఇసూబ్, బైండ్ల ప్రశాంత్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్, బెజ్జోరా, సిద్దపల్లి లింగాపూర్‌లలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి పాల్గొన్నారు.

వేల్పూర్: కొత్తపల్లి(ఎస్), వాడి, అక్లూర్, మోతె, రామన్నపేట్ గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మార చంద్రమోహన్, నర్సారెడ్డి, బొంబాయి గంగాధర్ పాల్గొన్నారు.

బోధన్: కాంగ్రెస్ పార్టీ సాలూర మండల కమిటీ అధ్వర్యంలో శుక్రవారం మందర్నాలో పాదయాత్ర చేశారు. అక్కడి నుంచి హున్సా మీదుగా ఖాజాపూర్ గ్రామం వరకు కొనసాగించారు. గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ రాజ్యాంగ చరిత్రను నాయకులు ప్రజలకు వివరించారు. నాయకులు చీల శంకర్, సంతోష్, నరేందర్ రెడ్డి, మందర్నా రవి, అల్లె జనార్దన్, శ్రీనివాస్‌రావు, అల్లె రమేష్ పాల్గొన్నారు.

రెంజల్(బోధన్): కల్యాపూర్, కిసాన్‌తండా, కూనేపల్లి, బాగేపల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. నాయకులు మొబిన్ ఖాన్, సుమన్, ధనుంజయ్, ఒడ్డెక్క మోహన్, సురేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: కోస్లీ, మిఠాపూర్, యంచ, మద్దెపల్లి గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్‌లో భాగంగా ఈ పాదయాత్ర చేపట్టినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వేల్పూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

వేల్పూర్/మోర్తాడ్/బోధన్‌రూరల్/రెంజల్/రుద్రూర్: వేల్పూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి ప్రారంభించారు. భీమ్‌గల్ మండలం మెండోరాలో ఎంపీడీవో సంతోష్ కుమార్, డీఎల్‌పీవో శివకృష్ణతో కలిసి ప్రారంభించగా.. బోధన్ మండలం ఎరాజ్‌పల్లిలో ఏఎంసీ డైరెక్టర్ వసంత్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ నేతలతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అలాగే రెంజల్ మండలం బాగేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో.. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, కోటగిరిలో ఏఎంసీ చైర్మన్ హన్మంత్, రుద్రూర్ మండలం సిద్ధాపూర్‌లో వర్ని ఏఎంసీ చైర్మన్ సురేష్‌బాబా స్థానిక నేతలతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని వారు సూచించారు.

50 శాతం సబ్సిడీపై గొర్రెలు, మేకలు



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి

మాక్లూర్: గొర్రెలు, మేకలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా 50 శాతం సబ్సిడీపై అందించటానికి కేంద్ర ప్రభుత్వం ముందుకొస్తుందని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి అన్నారు. శుక్రవారం బోర్గాం(కె)లో జరిగిన గొర్రె, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు బూరోల్ల అశోక్, యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడు మేడిద ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పాల ఉత్పత్తిని పెంచటానికి పాడిపశువుల పెంపకానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. రైతులు డిమాండ్‌కు అనుగుణంగా పాడిపశువులు, గొర్రె, మేకల పెంపకానికి ముందుకురావాలన్నారు. మండల పశువు వైద్యాధికారి ఉమా సహేర్ మాట్లాడుతూ..పశువులకు ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంఘ సభ్యులు గంగాధర్, సందీప్, సంతోష్, గంగమల్లు, దాసరి సాయిరెడ్డి, పాల్గొన్నారు.

సినిమాలు

పీబీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 వృషభ-10.30, ఎల్‌వైఎఫ్-1.40, 28సీ-7.55, కోర్ట్-4.45, 10.25
- స్క్రీన్-2 సికిందర్ (హిందీ) - 10.00, 1.00, 7.10, 10.10, రాబిన్‌హుడ్-4.00
- స్క్రీన్-3 మ్యాడ్ స్క్వేర్-11.20, 2.05, 4.50, 7.35, 10.20
- స్క్రీన్-4 కోర్ట్-10.10, రాబిన్‌హుడ్-1.15, 10.20 దీర-4.25, ఆదిత్య369-7.15



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,800	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,805		

– నిజామాబాద్ బిజినెస్

టిఫిన్, చికెన్ సెంటర్లకు నోటీసులు

మోర్తాడ్: పరిశుభ్రత పాటించని టిఫిన్, చికెన్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని మోర్తాడ్ గ్రామ పంచాయతీ నిర్ణయించింది. ఈ మేరకు గ్రామంలోని టిఫిన్, చికెన్ సెంటర్ల యజమానులకు అవగాహన కల్పిస్తూ నోటీసులను జారీ చేశారు. వ్యర్థాలను రోడ్ల పక్కన పడవేస్తుండటం.. ఈగలు, దోమల బెడద అధికమవడంతో.. ఈ అంశంపై కొంత మంది వ్యక్తులు గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశారు. మొదట్లో నోటీసులను జారీ చేసి..ఆ తర్వాత మార్పు చూడాలని భావించారు. చెత్తాచెదారాన్ని పంచాయతీ చూపించిన స్థలంలో పారవేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసు కళాబృందం అవగాహన

ఎడపల్లి(బోధన్): ఏఆర్‌పీ క్యాంప్‌లో శుక్రవారం పోలీసు కళాజాత బృందం ప్రజలకు నాటిక, పాటలతో అవగాహన కల్పించారు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ...వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఫోన్లు చోరీకి గురైతే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు.